

ముస్కాన్ చిన్న పిల్లల పెదవుల చీలకలు, అంగిలి సమస్యలపై సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

పిల్లల పెదవుల చీలికలపై అవగాహన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల పెదవుల చీలకలు, అంగిలి సమస్యలపై అవగాహన కల్పించడానికి ముస్కాన్ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. శనివారం ఉదయం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా అవగాహన ప్రచార వ్యాన్‌కు జెండా ఊపి ప్రారంభించారు. హిమాలయ వెల్నెస్ కంపెనీ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా విస్తృతమైన అవగాహన ప్రచారాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆస్పత్రిలో పెదవి, అంగిలి చీలిక పరిస్థితులపై అవగాహన పెంచడానికి ఉచిత శస్త్ర చికిత్సల కోసం రిజిస్ట్రేషన్ల కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హిమాలయ వెల్‌నెస్ కంపెనీ కన్స్యుజమర్ ప్రొడెక్ట్స్ డివిజన్ రాజేష్ కృష్ణమూర్తి, స్మయిల్ ట్రైనర్స్ సీనియర్ వైస్ ప్రసిడెంట్ మమత కర్రోల్ పాల్గొన్నారు.



ఉద్యోగుల శిక్షణ ముగింపులో మాట్లాడుతున్న అంబేడ్కర్ వర్సిటీ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి

ఉద్యోగులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

● ప్రొ.జి.పుష్పా చక్రపాణి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని.. పెరుగుతున్న టెక్నాలజీని ఎప్పటికప్పుడు అందిపుంచుకుంటూ ముందుకు వెళ్లాలని డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి అన్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎస్‌టీడీ) ఆధ్వర్యంలో టీజీఎస్పీ ద్వారా నియమితులైన జూనియర్ అసిస్టెంట్ సిబ్బందికి వారం రోజుల పాటు నిర్వహించిన "ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ జూనియర్ అసిస్టెంట్స్" శిక్షణా కార్యక్రమం శనివారం వర్సిటీలో ముగిసింది. కార్యక్రంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొ. పుష్పా చక్రపాణి మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా భవిష్యత్‌లో విశ్వవిద్యాలయ పాలనా విభాగంలో కీలక భూమికను నిర్వహిస్తారని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.యల్. విజయకృష్ణా రెడ్డి మాట్లాడుతూ ఏ సంస్థలోనైనా సజావుగా కార్యకలాపాలు జరిగేలా చూసుకోవడంలో ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. జూనియర్ అసిస్టెంట్ విధులు పాలనా విభాగంలో కీలకం అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సీఎస్‌టీడీ ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్రమం తప్పకుండా శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్‌టీడీ ఆఫీసర్ ఇన్‌చార్జి డా.పరాంకుశం వెంకటరమణ అన్నారు.

84 కోసుల పరిక్రమణ బ్రోచర్ ఆవిష్కరణ

పంజాగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మోక్ష మార్గానికి నైమిషారణ్య పరిక్రమణ అద్భుతం అని నైమిషారణ్యం వేదవ్యాస పీఠం పీఠాధిపతి అనిల్ కుమార్ శాస్త్రి గురూజీ అన్నారు. దధీచి నైమిషారణ్య పరిక్రమణ మహోత్సవంలో పాల్గొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించేందుకు ఆయన శనివారం హైదరాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మార్చి 1 నుంచి 13వ తేదీ వరకు జరిగే దధీచి 84 కోసుల పరిక్రమణ మహోత్సవం బ్రోచరును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిక్రమణ మహోత్సవం ప్రతి రోజు ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ఉంటుందని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

మహిళను మోసం చేసినవారిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉంటున్నమహిళతో మంచిగా నటించి ఆమెతో సహజీవనం చేశాడు. దుబాయ్‌కు వెళ్లిన తరువాత సదరు వ్యక్తి భార్య కుటుంబ సభ్యులు మహిళ ఇంటికి వెళ్లి బలవంతంగా సంతకాలు పెట్టించుకొని నగలు తీసుకొని వెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ పరిధిలోనివసించే మహిళకు ఓ వ్యక్తితో వివాహం జరిగింది. 2012 నుంచి అతనితో విడిపోయి ఒంటరిగా ఉంటుంది. 2014 నుంచి కుడుపుడి ప్రసాద్‌రావు అనే వ్యక్తి ఫేస్‌బుక్ ద్వారా పరిచయం అయ్యాడు. దుబాయ్‌లో ఉండే ప్రసాద్ వచ్చి ఆమెను ప్రేమిస్తున్నట్టు నమ్మించాడు. ఆ తరువాత దుబాయ్ నుంచి వచ్చిన ప్రతిసారి ఆమెతో సహజీవనం చేసేవాడు. కొద్ది కాలానికి అతని ప్రవర్తన తీరు మారింది. ఆమెతో దిగిన ఫొటోను ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. ఈ నెల 6న ప్రసాద్ భార్య భవాని, తండ్రి రామకృష్ణ మహిళ ఇంటికి వచ్చారు. ఆమెను బెదిరించి బలవంతంగా రూ.4.50 లక్షలు ఇచ్చేలా తెల్ల కాగితాల మీద సంతకాలు తీసుకున్నారు. అనంతరం 28 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకొని వెళ్లిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు బి.ఎడ్ వెబ్ ఆప్షన్‌కు చివరి తేది

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): డా. బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం-2024 సంవత్సరానికి బి.ఎడ్ (ఓడియల్) వెబ్ ఆప్షన్ ఆన్‌లైన్‌లో నమోదుకు చివరి తేది ఫిబ్రవరి 9 అని విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.వై.వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బి.ఎడ్ (ఓడియల్) ప్రవేశ పరీక్ష 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు వెబ్ ఆప్షన్ కోసం రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. స్కాన్ చేసిన సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి నిర్ధారిత రుసుం ఫిబ్రవరి 9వ తేది లోపు చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 040-23680333/444/544 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని, లేదా విశ్వవిద్యాలయ పోర్టల్ www.braouonline.in లేదా www.braou.ac.in సందర్శించాలని సూచించారు.



తమను రక్షించాలని వేడుకుంటున్న దంపతులు

కొడుకు, కోడలు నుంచి రక్షించండి

సీఎంకు విజ్ఞప్తి చేసిన వృద్ధ దంపతులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆస్తికోసం కొడుకు కోడలు వేధింపుల నుంచి తమను రక్షించాలని ఓ వృద్ధ దంపతులు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో హయత్‌నగర్‌కు చెందిన బలరాం, మంగమ్మ దంపతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. భవన నిర్మాణ కార్మికుడిగా, మేస్త్రీగా పనిచేసి సంపాదించిన ఆస్తితో ఇద్దరు ఆడపిల్లలకు వివాహం చేయగా మిగిలిన వాటిని సమానంగా పంచామని తెలిపారు. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న తన పెద్ద కుమారుడు సంతోష్, కోడలు రేణుకలు తమకు మరింత ఆస్తి ఇవ్వాలంటూ వేధింపులకు గురి చేశారని కన్నీరు పెట్టుకున్నారు. తమపై అకారణంగా కేసులు పెట్టి న్యాయస్థానాల చుట్టూ తిప్పుతున్నారని అన్నారు. వారి వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకునే దుస్థితి నెలకొందని వాపోయారు. సీఎం రేవంత్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి తమకు రక్షణ కల్పించడంతోపాటు న్యాయం చేయాలని వారు మొర పెట్టుకున్నారు.

జలమండలి కార్యాలయంలో అక్రమ పార్కింగ్

పట్టించుకోని అధికారులు, పోలీసులు



జలమండలి కార్యాలయంలో పార్క్ చేసిన, శిథిలావస్థైన వాహనాలు





బోరబండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జలమండలి కార్యాలయంలో విశాలమైన స్థలం. ఇక్కడ వాహనాలు పార్కింగ్ చేసినా సిబ్బంది పట్టించుకోరు. అందుకే ఇతరులు జలమండలి కార్యాలయ ప్రాంగణాన్ని పార్కింగ్‌కు అనువుగా మార్చుకున్నారు. వాహనం ఎవరు ఇక్కడ నిలిపారు..? వాహనం ఎవరిది ఎలాంటిదని పట్టించుకునే వారు లేరు. అసాంఘిక కార్యకాలపాలకు ఉపయోగించారా..? రోడ్డు ప్రమాదానికి గురైన వాహనమా..? దొంగిలించబడిందా..? అని అడిగే వారు లేరు. అదే సైట్-2లోని ప్రభుత్వ జలమండలి కార్యాలయం.

పార్కింగ్ నిలయంగా..

కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు సైట్-2 జలమండలి కార్యాలయంలో అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీనికి తోడు ఆరు నెలలుగా శిథిలావస్థైన రెండు కార్లను ఇక్కడ తెచ్చి పెట్టారు. ఈ కార్లు ఎవరివి..? ఎక్కడ నుంచి తెచ్చారు అన్న పర్యవేక్షణ కార్యాలయ అధికారులకు లేదు. ఎపి09 బివై2285 నల్లని బొలేరో, ఎపి20 ఎక్యూ3645 స్కార్పియో రెండు వాహనాలు పూర్తిగా శిథిలావస్థై ఉన్నాయి. వీటితో పాలు ఎక్సకవేటర్, క్రషర్ ట్రాక్టర్ కూడా రోజుల తరబడి నిలుపుతున్నారు. కార్యాలయ అధికారులు, పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఈ కార్యాలయంలోని వాహనాలను తనిఖీలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వెంకటేష్, షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. వాటిని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫిలింనగర్‌లో శనివారం వెంకటేశ్వరనగర్‌కాలనీ, బంజారాహిల్స్ జూబ్లీహిల్స్ డివిజన్‌లకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా పేదల పక్షాన పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. పేదలు ఇళ్ల కోల్పోకూడదనే ఉద్దేశంతోనే హైడ్రాకు వ్యతిరేకంగా గళమెత్తినట్టు వివరించారు. చాలా కాలంగా మధ్య, పేద తరగతి ప్రజలు రేషన్‌కార్డు కోసం ఎదురు చూస్తున్నారని వారి కల కూడా త్వరలోనే నెరవేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, కాంగ్రెస్ నాయకులు మామిడినర్సింగరావు, రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

తులం బంగారం ఎప్పుడిస్తారు

ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఎప్పుడిస్తారంటూ ఎమ్మెల్యే దానంనాగేందర్‌ను కార్పొరేటర్ వెంకటేష్ బ్రలు నిలదీశారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలనే ఇస్తున్నారు తప్పితే ప్రజలకు కొత్తగా చేసిందేమి లేదని ఆరోపించారు. తులం బంగారం ఇచ్చేదాకా కదిలేదని స్పష్టం చేశారు. దీనికి ఎమ్మెల్యే దానం స్పందిస్తూ త్వరలోనే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన అన్ని పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

గంజాయి విక్రేత అరెస్ట్

● 1.10 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎస్‌టీఎఫ్ సిబ్బంది అతడి వద్ద నుంచి 1.10 కిలోల గంజాయితోపాటు స్కూటీ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయాలపై పక్కా సమాచారమందుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్ సభ్యులు ఎస్ఆర్‌నగర్ ప్రాంతంలో నిఘా పెట్టారు. ఈ సమయంలో గంజాయి విక్రయించేందుకు స్కూటీపై వచ్చిన సయ్యద్ వాజిద్ రుమాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 1.10 కిలోల గంజాయి లభ్యం కావడంతో ప్రశ్నించగా, ఎండీ అజార్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేస్తున్నానని చెప్పాడు. అజార్ పరారీలో ఉన్నాడని ఎస్‌టీఎఫ్ సీఐ బిక్షారెడ్డి తెలిపారు. గంజాయి విక్రేతను పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి అభినందించారు.

మీ సేవ కేంద్రాల్లో రేషన్ కార్డుల లొల్లి

పంజాగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ కార్డుల కోసం మీ సేవల్లో దరఖాస్తు చేసుకోవచ్చని శుక్రవారం ప్రకటించిన నేపథ్యంలో ఖైరతాబాద్ మీ సేవ శనివారం ఉదయం నుంచి రేషన్ కార్డుల ఆశావాహులతో కిటకిటలాడింది. కానీ మీ సేవ వారు మాత్రం తమకు ఆదేశాలు రాలేదని, రేషన్ కార్డులకు సంబంధించిన సైట్ తెరుచుకోలేదని చెప్పడంతో, దరఖాస్తులను తీసుకోకపోవడంతో సెంటర్ల నిర్వాహకులపై దరఖాస్తుదారులు ఆగ్రహించారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వం దరఖాస్తుల పేరుతో ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా రేషన్‌కార్డుల కోసం వేచి చూస్తోంటే ఉన్న రేషన్ కార్డులను ప్రభుత్వం రద్దు చేయడమేమిటని పలువురు మండిపడుతున్నారు. దరఖాస్తు చేసుకొనేందుకు తమ పనులను వదులుకొని వచ్చి గంటల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వస్తుందని, అధికారులు ఏ మాత్రం సమాధానం చెప్పడం లేదని, సెంటర్ల నిర్వాహకులు తమకేమీ తెలియదని సమాధానం చెబుతున్నారని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో పేదలందరికీ రేషన్‌కార్డులు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో రేషన్ కార్డులులేని పేదలు దరఖాస్తు చేసుకున్నారని ఆ తర్వాత కుటుంబ సమగ్ర సర్వే, తర్వాత రేషన్ కార్డులు జారీచేస్తామని చెప్పారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



ఫ్రెషర్ డేలో విద్యార్థులతో ఉమెన్ సేఫ్టీ వింగ్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లావణ్య, ఆస్పత్రి డైరెక్టర్ బీరప్ప నగరి

ర్యాగింగ్‌కు పాల్పడితే ఫోన్ చేయండి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలి, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వెంటనే యాంటీ ర్యాగింగ్ వింగ్‌కు, ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేయాలని విద్యార్థులకు ఉమెన్ సేఫ్టీ వింగ్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ లావణ్య సూచించారు. నిమ్స్ ట్రామా ఆడిటోరియంలో శనివారం జరిగిన నిజాం వైద్య విజ్ఞాన సంస్థ, వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, ఎలాంటి ర్యాగింగ్‌కు పాల్పడినా విద్య, భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. నిమ్స్ డైరెక్టర్ బీరప్ప నగరి మాట్లాడుతూ ఈ సంస్థలో విద్యార్థులకు సీటు రావడం అదృష్టమని, ఇక్కడ స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఎక్విప్మెంట్ అధునాతన సిటీ, ఎమ్మారై, లాబరేటరీ ఎక్విప్మెంట్, రోబోటిక్ యంత్రాలు ఉన్నాయని, అనుభజ్ఞులైన సాంకేతిక సిబ్బంది, ఎక్సలెంట్ ఫ్యాకల్టీ ఉన్నారని వివరించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు డాక్టర్ లావణ్య బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, అసోసియేట్ డీన్ డాక్టర్ రాంరెడ్డి, వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్, వైద్యులు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి శైలజ, టెక్నికల్ కోఆర్డినేటర్స్ శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణ చేసి మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ -పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి



బ్లాక్ ఫిలింను తొలగిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బ్లాక్ ఫిలింను తొలగించేందుకు పోలీసులు శనివారం బ్లాక్‌ఫిలిం డ్రైవ్‌ను నిర్వహించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, రోడ్డు నంబరు 36లో పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి బ్లాక్ ఫిలింతో తిరుగుతున్న వాహనాలను ఆపారు. స్వయంగా బ్లాక్ ఫిలింను తొలగించారు. బ్లాక్ ఫిలంతో తిరుగుతున్నవి ఖరీదైన కార్లు అని పోలీసులు నిర్ధారించారు. సుమారు 85 కార్ల బ్లాక్ ఫిలిం తొలగించినట్టు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బేగంపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా ముందడుగువేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం బేగంపేటలోని స్వామి రామానంద తీర్థ స్మారక కేంద్రంలో స్కిల్ భారత్ కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం, రాష్ట్రం, దేశం ప్రగతి సాధ్యమౌతుందన్నారు. మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ అందజేస్తుండటాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ వాణిదేవి మాట్లాడుతూ స్కిల్ భారత్ శిక్షణా కేంద్రం ద్వారా మూడు నెలల పాటు కొనసాగే శిక్షణలో 40 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికేట్లను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ భారత్ ప్రతినిధి ఆర్. లక్ష్మణ్, కార్పొరేటర్ టి. మహేశ్వరి, బి.ఆర్.ఎస్ అధ్యక్షులు సురేష్‌కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు శ్రీహరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం'

బేగంపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట డివిజన్‌లోని ఎరుకల బస్తీ, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్ మహేశ్వరితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ బస్తీల్లో ఇళ్లు, భవనాలు నిర్మించుకునేందుకు అనుమతి ఇచ్చిన జీహెచ్ఎంసీ అధికారులు రోడ్లు వేసేందుకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకాశ్‌నగర్‌లో రహదారి నిర్మాణం చేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ రోడ్డు ఎందుకు నిర్మించడం లేదని అక్కడే ఉన్న జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ సమ్మయ్యతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని అధికారిని ఆదేశించారు.

రేషన్‌కార్డు దరఖాస్తుదారులతో

మీ సేవ కేంద్రాలు కిటకిట

● వెబ్‌సైట్ తెరుచుకోక వెనుదిరిగిన జనం

రాంగోపాల్ పేట్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ కార్డుల కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని శుక్రవారం ప్రకటించిన నేపథ్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని మీ సేవ కేంద్రాలు శనివారం దరఖాస్తుదారులతో కిటకిటలాడాయి. పారడైజ్ వద్ద గల మీ సేవ కేంద్రానికి ఉదయం నుంచే రేషన్ కార్డుల ఆశావహులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కానీ మీ సేవ వారు మాత్రం తమకు ఆదేశాలు రాలేదని, రేషన్ కార్డులకు సంబంధించిన పౌరసరఫరాల శాఖ వెబ్‌సైట్ తెరుచుకోలేదని చెప్పడంతో ప్రజలు నిరాశగా తిరిగి వెళ్లారు. అయితే, ప్రజాపాలన (ఆరు గ్యారంటీలు) కార్యక్రమంలో ప్రభుత్వం రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించిన నేపథ్యంలో, ప్రజలు తిరిగి దరఖాస్తు చేసుకుంటే రెట్టింపు అప్లికేషన్లు అవుతాయని, ఒక్కో దరఖాస్తుదారుని ఇంటికి రెండేసి సార్లు పరిశీలనకు వెళ్లాల్సి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందుగా ప్రజాపాలన దరఖాస్తులు పరిశీలించి, ఆ తర్వాత మీ సేవ కేంద్రాల్లో రేషన్ కార్డుల దరఖాస్తులు తీసుకుంటారని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా రేషన్ కార్డుల దరఖాస్తుల విషయంలో ప్రజల్లో మాత్రం గందరగోళం నెలకొంది. ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకుని తగిన ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు.



సీతాఫల్‌మండిలోని మీసేవ కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

ప్రజలను ప్రభుత్వం మభ్యపెడుతోంది: కార్పొరేటర్ హేమ

బౌద్ధనగర్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల మంజూరు విషయంలో ప్రజలను ప్రభుత్వం మభ్యపెడుతోందని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ మండిపడ్డారు. రేషన్‌కార్డుల దరఖాస్తుల గురించి తెలుసుకొనేందుకు శనివారం ఆమె సీతాఫల్‌మండిలోని మీసేవ కేంద్రాన్ని సందర్శించారు. రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించి శనివారం ఉదయం రేషన్‌కార్డు సంబంధించిన వైబ్‌సైట్‌ను నిలిపివేసిందని ఆరోపించారు. రేషన్‌కార్డుల విషయంలో ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆమె కోరారు.



ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

భక్తుల పాలిట కొంగుబంగారం ఉజ్జయిని మహాకాళీ అమ్మవారు: తలసాని

సికింద్రాబాద్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట కొంగుబంగారం ఉజ్జయిని మహాకాళీ అమ్మవారు అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహాకాళీ ఆలయంలో ఐదు రోజులు పాటు నిర్వహించే కోటి కుంకుమార్చనను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. అంతకు ముందు ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెలి మల్లికార్జున్ గౌడ్, ఆలయ కార్యనిర్వహణాధికారి మనోహర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తెలి శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ మాజీ సభ్యులు కిషోర్‌కుమార్, రామ్మోహన్‌యాదవ్, మహేందర్, అరుణ్‌భట్, ఆనంద్‌పాటిల్, నాగులు పాల్గొన్నారు.



మరాఠా బస్తీలో పర్యటించిన డీసీపీ రష్మీ పెరుమాళ్ తదితరులు

అర్ధరాత్రి రోడ్లపై తిరగకూడదు

● నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సమయంలో అవసరం లేకుండా రోడ్లపై ఎవ్వరూ తిరగకూడదని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. శుక్రవారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో డీసీపీ రష్మీ పెరుమాళ్ ఆధ్వర్యంలో తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ పలువురు పోలీసులు తుకారాంగేట్, అడ్డగుట్ట, మరాఠా బస్తీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, తుకారాంగేట్ పీఎస్ పరిధిలలో ఉన్న ఆలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, అర్ధరాత్రి సమయంలో అవసరం లేకపోయినా బైక్‌లపై రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఏరియాలో పాయింట్ బుక్ ఏర్పాటు చేయాలని, మధ్యరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు పెట్రోలింగ్ చేయాలని పోలీసులకు సూచించారు.



డి.నర్సింగ్‌రావు విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు

మాజీ మంత్రి డి.నర్సింగ్‌రావు సేవలు చిరస్మరణీయం

మారేడుపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతికి మాజీ మంత్రి దుడ్డు నర్సింగ్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శనివారం దుడ్డు నర్సింగ్ రావు 12వ వర్ధంతి సందర్భంగా పికెట్ లక్ష్మీనగర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కంటోన్మెంట్ బోర్డు మెంబర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి రాష్ట్ర మంత్రిగా ఎదిగారని గుర్తు చేశారు. ఆయన ఎన్నో పదవులను అధిష్టించి వాటికి వన్నె తెచ్చారన్నారు. అన్నారు. కార్యక్రమంలో కట్ట మైసమ్మ ఆలయ చైర్మన్ జి.కృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీఎన్ సంజీవరావు, నాయకులు రఘు, అశోక్ కుమార్, రాజేష్, చిట్టి, రాజశేఖర్, అనిల్, దిలిప్, శ్యామ్, టిల్లు, బాలచందర్, సచిన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడు మంద మల్లేశం మృతి



బౌద్ధనగర్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ అంబర్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మంద మల్లేశం(మల్లేశ్) శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. మల్లేశం మృతి పట్ల సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ యువ నాయకుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, సుంకు రామచందర్ తదితరులు అంబర్‌నగర్‌లోని మల్లేశం ఇంటికి వెళ్లి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. మృతుడి కుమారుడు బీఆర్ఎస్ యువ నాయకుడు మంద జగన్‌ను పరామర్శించారు. అంబర్‌నగర్ శ్మశానవాటికలో మల్లేశం అంత్యక్రియలు నిర్వహించారు.





మొక్కలు ఎండిపోయి పచ్చదనం కరువైన పార్కు

పచ్చదనం కరువు..

మట్టి దిబ్బల నెలవు!

అభివృద్ధికి నోచుకోని వెస్ట్ మారేడుపల్లిలోని నెహ్రూ పార్కు

● నిర్వహణ లేక ఎండిపోయిన మొక్కలు
● ఐదేళ్లుగా పని చేయని వాటర్ ఫౌంటెయిన్
● పార్కుకు వచ్చేందుకు జనం విముఖత

మారేడుపల్లి ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మొక్కలు.. పచ్చికబైళ్లతో సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు మట్టి దిబ్బలతో ఎడారిని తలపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మోండా మార్కెట్ డివిజన్ వెస్ట్ మారేడుపల్లిలోని జీహెచ్ఎంసీ నెహ్రూ పార్కు అభివృద్ధికి నోచుకోవడం లేదు. పచ్చదనం కరువు కావడంతో పార్కుకు వచ్చేందుకు స్థానికులతో పాటు సందర్శకులు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

ఎండిపోయిన మొక్కలు..

మారేడుపల్లిలోని నెహ్రూ పార్కు అభివృద్ధిని జీహెచ్ఎంసీ అధికారులు గాలికొదిలేశారు. ఈ పార్కు నిర్వహణ జీహెచ్ఎంసీ, పార్కు అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో కొనసాగుతోంది. నిర్వహణ కరువు కావడంతో పార్కులోని మొక్కలన్నీ ఎండిపోయాయి. వాటర్ ఫౌంటెయిన్ కూడా ఐదేళ్లుగా పని చేయడంలేదు. ఉదయం, సాయంత్రం వేళ్లలో సీనియర్ సిటిజన్లు, యువకులు ఇక్కడికి వచ్చి వాకింగ్ చేసేవారు. చిన్నారులు వివిధ రకాల ఆటలాడుతూ సందడిగా గడిపేవారు.

అభివృద్ధి కమిటీ విన్నవించినా స్పందించని అధికారులు

పార్కులో ఆహ్లాదం కరువు కావడంతో చిన్నారులతో పాటు పెద్దలు ఇక్కడికి రావడం దాదాపు మానేశారు. ఈ నేపథ్యంలో పార్కులో మొక్కలను నాటి పచ్చదనం పెంచడంతో పాటు వాటర్ ఫౌంటెయిన్‌కు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని, సందర్శకులకు కనీస సౌకర్యాలు కల్పించాలని పార్కు అభివృద్ధి కమిటీ సభ్యులు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు, హార్టికల్చర్ డైరెక్టర్ తదితర అధికారులను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పార్కులో గ్రీనరీని పెంచడంతో పాటు పార్కులోని విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పార్కు పచ్చదనం కొరవడింది. వాటర్ ఫౌంటెన్ గత ఐదేళ్లుగా పనిచేయకపోవడం, చెట్లన్నీ ఎండిపోవటం, గ్రీనరీకి బదులు దిడ్డలు దర్శనంతో పార్కులో సందర్శకులకు ఇబ్బంది కరంగా మారింది. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అనేక పార్కులను జీహెచ్ఎంసీ ఎంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అందుకు భిన్నంగా ఈ నెహ్రూ నగర్ పార్కు ఎండిపోయి సందర్శనకు దర్శనం ఇవ్వటంతో చాలా ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కులు సాయంత్రం వేళ్లలో వృద్ధులు పిల్లలు కుటుంబ సమేతంగా సందర్శించేందుకు ఇద్దందికరంగా ఉంటుందని లైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ నెహ్రూ నగర్ పార్కు అభివృద్ధి కమిటీ అధ్యక్షులు హనుమంతరావు యాదవ్ ఇటీవల అసిస్టెంట్ ఇంజనీర్ ఎలక్ట్రికల్ విభాగం అధికారి అనూషకు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు.

సమస్యలను పరిష్కరించండి

నెహ్రూనగర్‌లోని జీహెచ్ఎంసీ పార్కులోని వాటర్ ఫౌంటెయిన్ ఐదేళ్లుగా పని చేయడం లేదు. మొక్కలు ఎండిపోయి మట్టి దిబ్బలు దర్శనం ఇస్తున్నాయి. రాత్రిపూట లైట్లు వెలగకపోవడంతో పార్కుకు వచ్చే చిన్నారులు, పెద్దలు ఇబ్బంది పడుతున్నారు. పార్కులోని సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా నెహ్రూనగర్ పార్కులోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నా.

- హనుమంతరావు యాదవ్, నెహ్రూ నగర్ పార్కు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు



మరమ్మతుకు నోచుకోని వాటర్ ఫౌంటెయిన్

మమతా హైస్కూల్‌లో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

బౌద్ధనగర్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక అంశాలపై ఆసక్తి పెంచటానికి ఉపయోగపడటంతో పాటు సృజనాత్మకత, పరిశోధనాశక్తికి దోహదపడతాయని కంటోన్మెంట్ బోర్డు రిటైర్డ్ హెల్త్ సూపరింటెండెంట్ అబ్దుల్ మొహినుద్దీన్ అన్నారు. బోర్డు మూడవార్డు విమాన్ నగర్‌లోని మమతా హైస్కూల్‌లో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఆయన విద్యార్థులు తమ మేధాశక్తితో తయారు చేసిన వివిధ రకాల నమూనాలను తిలకించి, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ నమూనాలకు బహుమతులు అందజేశారు. మమతా హైస్కూల్ ప్రిన్సిపాల్ ఇంద్రారెడ్డితో పాటు ఉపాధ్యాయులు రాజేశం, శ్రీనివాస్, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న అబ్దుల్ మొహినుద్దీన్



బీజేపీ సంబరాలు..

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయం సాధించడంతో కంటోన్మెంట్ నియోజకవర్గ బీజేపీ శ్రేణులు శనివారం జేబీఎస్ చౌరస్తాలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, సీనియర్ నాయకులు భానుక మల్లికార్జున్, విజయానంద్, నాగభూషణం రెడ్డి, బీఎస్ శ్రీను, సతీష్, సచిన్, రాకేశ్, సంతోష్, విశాలిని, వినోద, మమత, అనురాధ తదితరులు పాల్గొన్నారు. (మారేడపల్లి-ఆంధ్రజ్యోతి)



ఓల్డ్ బోయినపల్లిలో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

● ట్రాఫిక్ సీఐ రవికుమార్

బోయినపల్లి, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): వాణిజ్య సముదాయాల ముందు ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యాపారులకు బోయినపల్లి పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ హెచ్చరించారు. సికింద్రాబాద్ ఓల్డ్ బోయినపల్లి, హస్మత్‌పేట ప్రధాన రహదారిపై వెలసిన పలు ఆక్రమణలను ఆయన తమ సిబ్బందితో కలిసి తొలగించారు. నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిలో కొంతమంది తమ దుకాణాల ముందు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు, కానిస్టేబుళ్ల సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● చైర్మన్ లక్ష్మణ్ ప్రసాద్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నూటయాభై ఏళ్ల చరిత్ర కలిగిన తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ ఆలయం గురించి భక్తులకు అవగాహన కల్పిస్తూ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని ఆలయ చైర్మన్ మేకల లక్ష్మణ్ ప్రసాద్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ నూతన కమిటీ సభ్యులు శనివారం ఆలయ ఆవరణలో పర్యటించారు. ఆలయంలోని సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, చిన్నపాటి వర్షం వస్తే చాలు ఆలయ ముఖద్వారం వద్ద నీరు కురుస్తుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిసిందన్నారు. వారం రోజుల్లో ఆలయంలో చిన్న చిన్న మరమత్తులు చేసేందుకు ప్రణాళిక తయారు చేశామన్నారు. ఆలయానికి అద్దె రూపంలో వస్తున్న డబ్బులు, ఆలయానికి ఎన్ని ఎకరాల భూమి ఉందనేది తెలుసుకొనేందుకు కమిటీ వేస్తున్నామన్నారు. ఆలయాన్ని సందర్శించిన వారిలో కమిటీ సభ్యులు, ముఖ్య సలహాదారు ఆదం భరత్ కుమార్, మూర్తి, విఠల్, సంతోష్, లలిత్, విష్ణు, నవీన్, సాయిలు ఉన్నారు.



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు తమ సమస్యలు తెలియజేస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారులు

ఫుట్‌పాత్ వ్యాపారుల జీవనోపాధికి ఆటంకం కలిగించొద్దు: ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారుడుపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ వ్యాపారుల జీవనోపాధికి ఆటంకం కలిగించేలా పోలీస్ అధికారులు వ్యవహ రించరాదని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేసుకుంటున్న తమను ట్రాఫిక్ పోలీసు అధికారులు ఇబ్బంది పెడుతున్నారని కొందరు వ్యాపారులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే శ్రీగణేశ్ శనివారం వెస్ట్ మారేడుపల్లి ప్రధాన రహదారిలో పర్యటించి ఫుట్‌పాత్ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా తాము తోపుడు బండ్లపై, ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని, అధికారుల వల్ల ఇప్పుడు తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యేకు వ్యాపారులు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీగణేశ్ వెంటనే ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్న వారి పట్ల మానవతా దృక్పదంతో వ్యవహరించాలని, వారిపై కనికరం చూపించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనల్లో ఫుట్‌పాత్, తోపుడు బండ్ల వ్యాపారులకు కొంత వెసులుబాటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మారేడుపల్లి ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ క్లినిక్ ప్రారంభం

అడ్డగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ అనేది అత్యంత ప్రాముఖ్యత పొందిన చికిత్స అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శనివారం తుకారాంగేట్‌లో అక్షయ ఫిజియోథెరపీ క్లినిక్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ, ఫిజియోథెరపీ కేవలం చికిత్స మాత్రమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడే ఒక సమగ్ర వైద్య విధానమని అన్నారు.

నేషనల్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట

● రెండు బంగారు, ఒక రజత, ఒక కాంస్య పతకం సాధించిన కండక్టర్ స్వరాజ్యలక్ష్మి

సికింద్రాబాద్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ డిపోలో పని చేస్తున్న మహిళా కండక్టర్ బి.స్వరాజ్య లక్ష్మి రిలే పరుగు పందెంలో రెండు బంగారు పతకాలు, 400 మీటర్లలో రజత పతకం, ఒక కాంస్య పతకం సాధించారు. గత నెల 31 నుంచి ఈనెల 4వ తేదీ వరకు కేరళలోని త్రిశూల్‌లో నిర్వహించిన నేషనల్ అథ్లెటిక్స్ టోర్నమెంట్స్‌లో పాల్గొన్న స్వరాజ్యలక్ష్మి ఈ పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కంటోన్మెంట్ డిపో మేనేజర్ సుధాకర్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీపతి కృష్ణతో పాటు పలువురు ఉద్యోగులు స్వరాజ్యలక్ష్మికి శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏడీసీలు బి.మల్లయ్య, దామోదర్ రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు



పతకాలు సాధించిన స్వరాజ్యలక్ష్మిని అభినందిస్తున్న కంటోన్మెంట్ డిపో ఉద్యోగులు

మ్యాన్‌హోళ్ల లీకేజీలను వెంటనే అరికట్టండి

● జలమండలి అధికారులను కోరిన కార్పొరేటర్

బౌద్ధనగర్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి ప్రాంతంలో శనివారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ప్రతిరోజూ బస్తీలో మురుగునీరు పారుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని బస్తీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆమె జలమండలి అధికారులను తీసుకొని మురుగు లీకేజీ అవుతున్న మ్యాన్‌హోళ్లను పరిశీలించారు. మ్యాన్‌హోళ్లకు తాత్కాలికంగా మరమ్మత్తులు చేపట్టి లీకేజీలను నివారించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. నూతన డ్రైనేజీ లైన్ వేసేందుకు నిధులు మంజూరు చేయించి సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కుశాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



బౌద్ధనగర్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): నామాలగుండులోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాలు, పండితుల మంత్రోచ్ఛరణ మధ్య శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బిట్ల రఘునందన్ కుమార్, నాగులూరి శ్రీనివాస్‌గౌడ్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

యువకుడి రిమాండ్

బౌద్ధనగర్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య కేసులో వారాసిగూడ పోలీసులు ఆమెను వేధించిన యువకుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బౌద్ధనగర్ అంబర్‌నగర్‌కు చెందిన మచా ప్రవల్లిక(23), అదే బస్తీకి చెందిన సృజన్(25)లు నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కోఠి ఉమెన్స్ కాలేజీలో ప్రవల్లిక బీఎస్సీ నర్సింగ్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ప్రియుడు సృజన్ కొంతకాలంగా మరో యువకుడితో మాట్లాడుతున్నావంటూ ప్రవల్లికను వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ప్రవల్లిక ఆత్మహత్య చేసుకోవటానికి ప్రేరేపించిన సృజన్‌ను పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడిపై బీఎన్ఎస్ 108 సెక్షన్ కింద కేసును నమోదు చేశారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



పోకల పునీత

బౌద్ధనగర్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర్ కథనం ప్రకారం.. చిలకలగూడకు చెందిన పోకల పునీత(36)కు పుట్టినప్పటి నుంచీ మతిస్థిమితం సరిగా ఉండదు. 18 ఏళ్ల క్రితం నర్సింగరావు అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి పిల్లలున్నారు. శుక్రవారం రాత్రి తొమ్మిదిన్న గంటల సమయంలో దూద్‌బావిలో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన పునీత తిరిగి రాలేదు. ఆమె కోసం పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో తల్లి కొమరమ్మ తన కుమార్తె కనిపించటం లేదని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.